రైలు ప్రయాణం

ఆ స్టేషన్లో రైలు రెండు నిముషాలే ఆగింది. రాత్రి ఎనిమిది గంటలయింది. అయినా ప్లాట్‌ఫారం మీద సందడే లేదు. కనీసం సిగరెట్లు అమ్మేవారు కాని, మరే తినుబండారాలు అమ్మేవారుకాని లేరు. అసలది రైలు స్టేషన్లాలేదు. రైలు కూతబెట్టి ముందుకు సాగింది. "రైల్వే కాంటీన్" అని పెద్ద బోర్డు కనిపించింది. చిన్న కొట్టులాంటిది. దాని తలపులయితే మూసి ఉన్నాయిగాని ప్రక్కన ఫలహారాల బోర్డు మాత్రం పెద్ద పెద్ద అక్షరాలతో, వెలలతో సహా కనిపించింది. రామమూర్తి నవ్వుకొన్నాడు.

రైలుస్టేషను దాటి వచ్చేసింది. అప్పుడే మరో వ్యక్తి లోపలికి వచ్చినట్లు గమనించాడు రామమూర్తి. అతను సన్నగా బక్కపలచగా ఉన్నాడు. ఉంగరాలజుట్టు చిన్న మొహం. చప్పి దవడలు. విచిత్రంగా చూసే కళ్లు.

రామమూర్తి జరిగి అతనికి చోటిచ్చాడు. అతని చిరునవ్వు ఆ మొహానికి వింత అందాన్ని ఇచ్చింది. లేకపోతే అతనిలో ఏ కోశానా అందం లేదనవచ్చు.

"ఎక్కడిదాకా ప్రయాణం" అని పలకరించాడు.

"హైద్రాబాదు" అన్నాడు రామమూర్తి.

"నేను అనంతపురం వెళ్తున్నాను" అన్నాడతను

రామమూర్తి "అలాగా" అన్నట్లు తల ఊపాడు.

"అక్కడే గవర్నమెంటు స్కూల్లో పని చేస్తున్నాను."

"భావి పౌరులను తీర్చి దిద్దుతున్నారన్న మాట."

"అబ్బేలేదు. వారికి వంకర టింకర గీతలు నేర్పిస్తున్నాను."

"అదేం?"

"ఫ్రీ హేండ్ డ్రాయింగ్" అంటూ నవ్వాడు.

"చిత్రకారులా?"

"డ్రాయింగ్ నేర్చిన ప్రతివాడూ చిత్రకారు డయితే ఇంకేముంది? కలం పట్టిన ప్రతివాడూ కవి కాగలడా?"

"ఈ కాలం కవులెక్కువ పాఠకులు తక్కువ అనాలి"

"తప్పు తప్పు రచయిత్రు లెక్కువ పాఠకులు తక్కువ అనాలి."

"ఏం రచయిత్రులమీద దాడి చేశారు?"

"వారు నవలలు వండుతారని విన్నాం" అన్నాడు నవ్వుతూ.

"అవును మరి బయటి సంపాదన రచయితలదయిపోయె. రచయిత్రులది స్వయం పాకమైనందుకు సంతోషించాలి."

మాటలు సాగుతూ ఉన్నా ఆ వ్యక్తి చేతిలోని నోటు బుక్కుపై పెన్సిలుతో ఏవో గీతలు గీస్తూనే ఉన్నాడు. ఇప్పుడది రామమూర్తికి ఇచ్చాడు.

"ఎంత త్వరగా నా స్కెచ్ వేసేశారు! వండర్ ఫుల్! ఓహో మీ పేరు రంగనాధమా?"

"అవున" న్నట్లు తల ఊపాడు.

"మీ పేరు?"

"రామమూర్తి."

"ఈ స్కెచ్ నిజంగా ఎంతో బాగుంది" రామమూర్తె అన్నాడు.

"మీరు బాగున్నారు గనక"

రామమూర్తి ఆ మాటలు విననట్లు చేతిలోని పత్రిక పేజీలు తిరగవెయ్యసాగాడు.

"ఇంత టాలెంటు ఉంది. ఏ న్యూస్ పేపర్లోనో కార్టూనిస్టుగా చేరకూడదూ" అన్నాడు.

"ఇందాకా చిత్రకారునిగా అందలమెక్కించి ఇంతలో కార్టూనిస్టుగా క్రిందకు దింపుతున్నారు."

"నో.... నో.... కార్టూనిస్టు ఏ చిత్రకారుడికీ తీసిపోడు. అంతే గాక చిత్రకారుడికంటే ఎక్కువ బుర్ర ఉండాలి. చూడండి ఈ వార పత్రికే చూడండి. ఇందులో ఈ కార్టూన్ నాకు చాలా నచ్చింది. దీనిలో ఎంత సున్నితంగా కార్టూనిస్టు తన భావం చెప్పాడో చూడండి"

రంగనాథం ఆ కార్టూన్ చూశాడు—తన చేతిలో పెన్సిల్‌తో అల్లైన్లు మరింత కొట్టొచ్చేటట్లు దిద్దాడు. యథాలాపంగా పేజి తిరగవేసి అక్కడో కథలు చూసి అర్థవంతంగా నవ్వాడు

"ఎందుకు నవ్వుతున్నారు?" అని రామమూర్తి అడిగాడు.

అక్కడ రచయిత్రి పేరు క్రింద గీత గీస్తూ "ఈమె నాకు బాగా తెలుసు" అన్నాడు.

"అలాగా?" అన్నాడు రామమూర్తి.

"అలాగా అని తేలికగా తీసి వెయ్యకండి మాది చాలా గట్టి బంధం."

రామమూర్తి ఇప్పుడూ మాట్లాడలేదు.

"మీకు రొమాన్సులంటే ఇష్టమా?"

"రొమాన్సంటే చాలా అర్థాలున్నాయి. రష్యను, ఫ్రెంచి భాషలలో మామూలు నవలనే 'రొమాన్స్' అంటారు. ఫ్రాన్సులో మాట్లాడే ఒక భాషను రొమాన్సు అంటారు. సత్యానికి దూరమైన కల్పితాన్ని రొమాన్స్ అంటారు."

"సార్. సార్. మా ఇంగ్లీషు మాష్టారి కంటె ఎక్కువ అర్థాలు చెబుతున్నారు. నేను అడిగేది మామూలుగా మనకు అర్థమయ్యే రొమాన్స్.... అంటే నవలా భాషలో ప్రేమాయణం అనుకోండి."

"ఎవరి ప్రేమాయణం? మీదా? నాదా?"

"ఒహో మీకూ ఓ ప్రేమకథ ఉందన్న మాట."

"ఏం అంత అన్ రొమాంటిక్‌గా కనిపిస్తున్నానా?"

"అబ్బే అలా అని కాదు చాలా జెంటిల్ మాన్‌లా ఉంటేనూ...."

"జెంటిల్‌మెన్ ప్రేమించరా? అనామకులు, రౌడీలూ, గూండాలూ ప్రేమిస్తారా?"

"ఓ గాడ్ మీరు కూడా ప్రయత్నిస్తే రచయిత కావచ్చు సార్. కనీసం రచయిత్రిగారి భర్తగానైనా రాణిస్తారు."

"థ్యాంక్యూ....థ్యాంక్యూ. ఇక మీ ప్రేమకథ మొదలెట్టండి"

"ఏ కథ అని చెప్పమంటారు? పోనివ్వండి. ఈ రచయిత్రి గురించే చెప్పుకొందాం. రాజీ నేనూ ఒకే స్కూల్లో చదువుకొన్నాం. తను స్కూలు పైనలుకు వచ్చేసరికి అరవిచ్చిన గులాబి మొగ్గలా తయారయింది. మొట్టమొదటిసారిగా తన హృదయాధిపతినైన ఘనత నాకే దక్కింది"

"మరి ఆ ఆధిపత్యం ఎందుకు వదులు కొన్నారు?"

"ప్రేమ కథలు ఎప్పుడూ సాఫీగా సాగవు సార్. అలా జరిగితే అవి ప్రేమకథలేకావు.... ఆ రోజుల్లో ఒకర్ని ఒకరు ఎంత చూసుకొన్నా తనివి తీరేదే కాదు. ఎన్ని కబుర్లు చెప్పుకొన్నా ఇంకా మిగిలిపోతూనే ఉండేవి. మా స్నేహం చూచి చాలామందికి కన్ను కుట్టింది. కొందరు స్నేహితులు మొరటుగా పరిహాసాలు కూడా ప్రారంభించారు. నేను అందరికీ తెగేసి చెప్పాను 'రాజీ నేనూ ప్రేమించు కొన్నామ'ని. రాజీ మాత్రం సూటిపోటి మాటలకు తట్టుకోలేక పోయింది. అప్పటి నుండి మాటలు బదులు ఉత్తరాల పరంపర ప్రారంభమైంది. ఎన్నిచోట్ల చాటుగా కలుసు కొన్నామో ఎన్నిసార్లు తన బుగ్గలు ...." ఇక్కడ రంగనాథం ఆగి అర్థవంతంగా నవ్వాడు.

రామమూర్తి నవ్వాడు "కానివ్వండి,"

"ఒకసారి ఊరి బయట మామిడి తోటలో మా సంకేత స్థలంలో కలుసుకొన్నాం. మా కబుర్లలో మేము మునిగి వాళ్ళ నాన్నగారు రావటమే గమనించలేదు. రాజీ మాత్రం గజగజ వణికిపోయింది. ఆ తర్వాత వారం రోజులు కలవలేకపోయాం. ఇంతలో పరీక్షలు వచ్చేశాయి. తనను తిరిగి పరీక్ష హాల్లోనే చూశాను. ఎర్రబడ్డ కళ్ళతో ఎలాగో ఉంది. పరీక్షలు కాగానే ఫలానా చోట కలుసుకోమని చీటీ పంపించాను.

అది నామిత్రుల గది. వాడు మమ్మల్ని ఒంటరిగా వదిలి తెలివిగా జారుకొన్నాడు. రాజీ కన్నీరు మున్నీరై ఏడ్చింది. నిజం చెప్పొద్దూ నాకూ చాలా బాధనిపించింది. వాళ్ళమ్మా నాన్నా బాగా కోప్పడ్డారట.

నానామాటాలూ అన్నారట. "కన్న తల్లిదండ్రులే తమ పిల్లల్ని అలా నిందించగలరని నేనెప్పుడూ ఊహించలేదు." అంది ఎర్రబడ్డ కళ్లను తుడుచుకొంటూ. రాజీ ఎప్పుడూ వెర్రి మాలోకమే. పుస్తకాలలో మాదిరి మాట్లాడుతుంది. చేతలూ అంతే, వాళ్ల నాన్నగారు బదిలీ చేయించు కొన్నారట. "ఇంకెప్పటికీ కలుసుకోలేమేమో!" అంది నా జుట్టు నిమురుతూ. ఆ రోజు ఆ ఒక గంటా వృధా చేసుకోదలచలేదు నేను. దొరికిన అపూర్వావకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాం. ఒకరి సాన్నిధ్యంలో మరొకరు మైమరచాం. స్వర్గానికి నిచ్చెనలు వేశాం. క్లుప్తంగా చెప్పాలంటే...."

"చాలు చాలు. అర్థమయింది" అన్నాడు రామమూర్తి "ఇంతకూ మీ ప్రేమకథ జరిగి ఎన్నాళ్లయింది?"

"ఇప్పటి మాటా? అప్పుడు నాకు పద్దెనిమిదేండ్లు. ఇప్పుడు ముప్పయి అంటే పన్నెండేళ్లనాటి మాట"

"తర్వాత మీ రెప్పుడూ కలుసుకోలేదా?"

లేదని తల అడ్డంగా ఊపాడు.

"కనీసం ఉత్తరాలైనా వ్రాసుకోలేదా?"

"లేదు. కాని ఎనిమిదేళ్ళ క్రితం ఒకసారి ఆమెకో పెళ్లి సంబంధం వచ్చింది. అనుకోకుండా అతన్ని మా బంధువుల యింట్లో కలుసుకొన్నాను. అతనే చెప్పాడు ఫలానావారి అమ్మాయిని చూడటానికి ఫలానా ఊరు వెళ్తున్నానని. చాలా సరదా అయిన మనిషి. ఆ రాత్రి కాస్త సంబరం చేసుకొన్నాం. ఎందుకో ఆ రాత్రి రాజీ పరాయి సొత్తు కాబోతుందనే భావనే భరించలేకపోయాను. అందుకే అతనికి నేనూ రాజీ ఎంతగా ప్రేమించుకొన్నామో చెప్పాను. తను నాకు వ్రాసిన ఉత్తరాలు చూపించాను. ఆ తర్వాత అతను వెళ్ళాడో లేదో నాకేమీ తెలీదు. నాలుగయిదేండ్లుగా రాజీ కథలు, నవలలు చూస్తున్నాను. గడచిన రోజులు నెమరువేసుకొంటున్నాను.... ఎలా ఉంది సార్ నా ప్రేమ కథ?"

"బ్రహ్మాండంగా ఉంది. అయితే మీరు కాస్త ట్రాజిక్ హీరోగా మారి ఉంటే కథ మరింత రక్తి గట్టేది."

"మరీ చురుకుగా తగిలిస్తారండోయ్, సరేసరే మీ కథ చెప్పండి."

"నాదేముందిలెండి - మీ కథలా మలుపులు తిరిగి జిలుగులు సంతరించుకోలేదు. 'బాబీ' సినిమాలోని టీన్ ఏజ్ ప్రేమ కూడా కాదు తనూ, నేనూ ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం. ఒకరి కొకరం దగ్గరయ్యాం. కలిసి జీవిస్తే బాగుంటుందనుకొన్నాం. పెళ్ళి చేసుకొన్నాం అంతే."

"చప్పచప్పగా ఉంది. కష్టాలూ, కన్నీళ్ళూ లేకపోతే అదీ ఒక ప్రేమ కథేనా? మీ ప్రేమకు అడ్డంకులే లేవా?"

"కులం వగైరాలు అడ్డంకులని మీరనుకొంటే మాకూ అడ్డంకులు వచ్చాయనే చెప్పవచ్చు. గట్టిగా పట్టుబడితే, ఆత్మ విశ్వాసం ఉంటే మనం సాధించలేనివి ఏముంటాయి? గుండెబలం, కండబలం.... అంటే ఆర్థిక స్తోమత ఉంటే చాలు."

"మీ కథ సుఖాంత మన్నమాట."

"ఇంకా అంతం కాలేదు. సుఖంగా అయితే సాగుతోంది. జీవితంలో కన్నీళ్ల లేకపోలేదు. ముఖ్యంగా మా ఆవిడ జీవితంలో. కాని మేమిద్దరం కలిసి ఆ కన్నీళ్లను ఆనందభాష్పాలుగా మార్చుకొన్నాం"

"చాలా మిస్టీరియస్‌గా ఉంది."

"మీ మిస్టరీ విడగొట్టాను. మీరిందాకా చెప్పిన 'రాజీ' నా భార్యే." రామమూర్తి అతని కళ్ళలోకి చూస్తూ చెప్పాడు.

రంగనాథం తెల్లబోయాడు.

"ఇప్పుడు చెప్పండి. మీ ప్రేమ కలాపాలు నిజమైనవేనా?"

"కాక?" కాస్త బింకంగా అన్నాడు.

"మీ దవడ వాయగొట్టటానికి నా సంస్కారం అడ్డొస్తోంది. లేకపోతే మిమ్మల్ని విసిరి రైలో నుంచి పారేద్దును."

రంగనాథం లేచి నిలబడ్డాడు. అనంతపురం స్టేషను దగ్గరపడుతున్నట్టుంది.

రామమూర్తి అతన్ని లాగి కూర్చోబెట్టాడు. "కాస్త ముఖపరిచయమున్న ప్రతి అమ్మాయీ తనను ప్రేమించిందని, పేరు తెలిసిన ఆడపిల్లలంతా తనతో ప్రేమ కలాపాలు జరిపారని డంబాలు పలికే హీరోలు మనలో చాలామందే ఉన్నారు. ఎదిగీ ఎదగని మనస్సులో స్నేహభావం విచ్చుకొన్నంత మాత్రాన దానికిమీరింతగా చిలువలు పలువలు చేర్చి చెప్పాలా? నిజం చెప్పండి. మీ మూలంగా రాజీ ఎన్ని అవమానాలు భరించిందో ఎన్ని అపనిందల పాలయిందో, మేకవన్నె పులిలా తన గురించి కథలు ప్రచారం చేసింది మీరు కాదూ! లేని రొమాన్సుకు ఊహల రంగులద్ది కథలు కథలుగా చిత్రించింది మీరు కాదూ? ఏదో పెళ్లి సంబంధం వస్తే అవాకులు, చెవాకులు చెప్పి అతని మనసు విరిచింది మీరు కాదూ?"

"ఇలాగని రాజ్యలక్ష్మి చెప్పిందా?"

"చెప్పాలా? మీ మాటల ధోరణి చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. పెద్ద మజ్నూలా పోజుకొడ్తే మాత్రం బండారం బయట పడదనుకొన్నారా? ముక్కూ మొహం తెలీని నా దగ్గరే ఇన్ని కథలు చెప్పిన మీరు పన్నెండేళ్ల క్రితం మీ స్నేహితులతో, పరిచయస్థులతో ఎన్ని డంభాలు పలికి ఉంటారో నేను ఊహించలేననుకొన్నారా?"

రైలు వేగం తగ్గింది. రంగనాథం తిరిగి లేచి చేతి సంచి అందుకొన్నాడు. "మేము ప్రేమించుకున్న మాట వాస్తవం నమ్మితే నమ్మండి, నమ్మకపోతే పొండి". అన్నాడు గొణుగుతున్నట్లు.

రామమూర్తి కళ్లు నవ్వుతో మెరిశాయి. 'చిన్నతనంలో ఒకరిమీద ఒకరికి కలిగే ప్రేమాభిమానాలను 'కాఫ్ లవ్' అంటారు. కాని 'ప్రేమయాణం'గా ఎవ్వరూ వర్ణించరు. మన సమాజ వ్యవస్థే అలా అఘోరించింది. ఒక అబ్బాయి, అమ్మాయి, ఏ వయస్సులో ఉన్నాసరే, ప్రేమ ముద్ర పడకుండా ఒకరి నొకరు అభిమానించుకోటానికి వీలులేదు. కాకపోయిన ఆప్యాయత అనేది అపురూపంగా దొరుకుతుంది. దానిని

పదిలంగా హృదయాంతరాళంలో దాచుకోవటం నేర్చుకోవాలి. ఆ ప్రేమ కుసుమాన్ని పదిమంది ఎదుటా ప్రదర్శిస్తే అది వాడి నలిగిపోతుంది.'

రైలు ఆగింది. రంగనాథం వెళ్ళబోతూ వెనక్కి తిరిగి, "ఈ విషయాలన్నీ మీ ఆవిడతో చెప్పకండి." అన్నాడు.

"ఏం ? మీరెంత దిగజారారో తనకు తెలిసిపోతుందని భయమా? షిస్టిల్ రెస్పెక్ట్స్ యు యాజ్ ఎ ఫ్రెండ్. మీ చిత్రకళ పట్ల తనకింకా అభిమానముంది. నమ్మినవాళ్ళకు వెనకపోటు పొడవటం స్నేహ ధర్మమా ?"

"క్షమించండి" రంగనాథం దిగిపోయాడు.

రైలు కదిలింది.

"ఏమండోయ్" అని చప్పట్లు కొట్టి పిలిచాడు రామమూర్తి.

అయిష్టంగానే కిటికీ దగ్గరకు వచ్చాడు రంగనాథం.

"నిజానికి రాజ్యలక్ష్మి ఎవరో నాకు తెలీదు" అన్నాడు చెయ్యి ఊపుతూ. రంగనాథానికి రైలు శబ్దంలో ఆ మాటలు సరిగా వినిపించ లేదు.

"రాజ్యలక్ష్మిని అడిగానని చెప్పండి" అంటూ అతను కేక పెట్టాడు.